■ సింగమనేని నారాయణ

# ఆనందం

చాలాకాలం తరువాత మా ఊరు వెళ్ళాల్సివచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది నాకు. నేను పని చేస్తున్న పట్టణం దూరాబారం కావడం వల్లనూ, ప్రత్యేకించి పనులు కూడా ఏమీ పడకపోవడం వల్లనూ, ఈ మధ్య దాదాపు అయిదేళ్ళుగా ఊరికి వెళ్ళడం కుదరనేలేదు. వెళ్ళకపోయినా, స్మృతుల్లో ఎప్పుడూ మా ఊరు మెదులుతూనే ఉంటుంది నాకు. ఎన్నోసార్లు కలల్లో మా ఊరి వీధులూ, మా ఇంటి గదులూ, మా తోటలో నేను ఎక్కి దుమికిన చెట్లూ, ఈత కొట్టిన బావులూ, ఎప్పుడూ ఎండిపోయినట్లుండే మా ఊరి చెరువూ, చెరువుకట్టమీది పోతలప్ప గుడీ, స్పష్టాస్పష్టంగా కదులుతూ నన్ను పరవశుణ్ణి చేస్తూంటాయి. మా ఊరి జ్ఞాపకాలు నాకెప్పుడూ ఇష్టంగా ఆత్మీయంగా ఉంటాయి. అయిదేళ్ళ క్రితం చిన్న తమ్ముడి పెళ్ళికి కుటుంబ సమేతంగా వెళ్ళి పదిరోజులు పాటుండి వచ్చాను. వెళ్ళకపోయినా ఊరి విషయాలు అడపా దడపా, కొద్దోగోప్పో తెలుస్తూనే ఉంటాయి. మా తమ్ముళ్ళు కూడా అప్పుడప్పుడూ వచ్చి పలకరించిపోతూ ఉంటారు. ఒకటి రెండుసార్లు ప్రయాణం రైలెక్కేదాకా కూడా వచ్చి, అనుకోని అవాంతరాలతో ఆగిపోయింది.

మా కుటుంబం ఇంకా అవిభక్తంగానే ఉంది. మా అమ్మా, నాన్నలు కాలం చేసి, పదేళ్ళు దాటినా అందరమూ ఇంకా కలిసే ఉన్నాము. నా తమ్ముళ్ళు ఇద్దరూ వ్యవసాయాలు చేసుకుంటూ ఇంకా ఒకే కుటుంబంగానే ఉంటున్నారు. నాలుగురోజుల క్రితం పెద్ద తమ్ముడు చాలా పెద్ద ఉత్తరం రాశాడు. ఎవరి భాగాలు వాళ్ళు తీసుకొని విడిపోవాలనుకుంటున్నాము. నువ్వు వచ్చి భాగ పరిష్కారాలు చేసి నీ భాగమేదో నువ్వు తీసుకొని, రాతకోతలు పూర్తి చేసుకొని పోవడం మంచిది అని రాశాడు. అన్నదమ్ములు విడిపోవడం అన్నది సహజమేకదా! మరీ తీవ్రమైన అగాధాలూ, ద్వేషాలూ, ఏర్పడి విడిపోవడం కన్నా, అంతో ఇంతో మనసులు బాగున్నప్పుడే వేరు పడడం మంచిది కూడా! నా భాగం ఆస్తి విషయమై, ఇంతకు ముందు ప్రస్తావన వచ్చినప్పుడు, నా భాగం కూడా మీరే పంచుకోండి, నాకేమీ అక్కర్లేదు అని స్పష్టం చేసినాను నేను. అయినా నీ భాగం నువ్వు తీసుకొనిపో అని తమ్ముడు రాయడం మాత్రం నాకు మనస్తాపాన్ని కలిగించింది. నిజానికి నాకు ఆస్తిలో భాగం తీసుకోవాలన్న ఆలోచన ఎప్పుడూ లేదు, నా ఉద్యోగంలో నేను మా తమ్ముళ్ళకంటే, సుఖంగా బతుకుతున్నాను. ఈ ఉద్యోగమూ అనుభవిస్తూ, ఆస్తిలోనూ వాటా తీసుకోవడం నాకు దురాక్రమణగానే అనిపిస్తూ ఉంటుంది. వాళ్ళ కడుపు కొట్టినట్టవుతుంది. ఆస్తి పంపకాల పని మీద, పనిగట్టుకొని వెళ్ళడం నాకు కొంత అసౌకర్యంగానే ఉంది. తమ్ముడు తేదీలు కూడా నిశ్చయించి, తప్పక రావాలని రాయడంతో బయల్దేరాల్సి వచ్చింది. ఆస్తి పంపకాలు కాస్త పక్కకు పెట్టివేస్తే మా ఊరు వెళ్ళడం నాకు ఉత్సాహమే! మూడు నాలుగురోజులు ఊళ్ళో గడప వచ్చుకదా అని మనసులో చిన్న కేరింత.

అనంతపురానికి అరవై కిలోమీటర్ల దూరంలో ఉంది మా ఊరు. అయిదువందల గడపలుండే పెద్ద పల్లె మా ఊరు. ఊరు మొత్తమంతా వ్యవసాయం మీదనే ఆధారపడి తరతరాలుగా జీవిస్తూ ఉంది. అన్ని కులాల వాళ్ళూ ఉన్నారు మా ఊళ్ళో. ఇటీవలి కాలంలో కుల సంబంధమైన చీలికలు మా ఊళ్ళో ఏర్పడ్డాయిగాని, ఇంతకు మునుపైతే 'కులతత్త్వం' అన్న భావనే ఎక్కడా కనిపించేది కాదు. మా ఊరి చుట్టూ విస్తారమైన ప్రభుత్వ భూములు ఉండడంవల్ల, పేదలకు చాలా వరకు పంచి వేయడంతో, అందరూ కొద్దో గొప్పో వ్యవసాయాలు చేసుకుంటున్నారు. భూస్వాములంటూ మా ఊళ్ళో ఎవరూ లేరు. యాభై అరవై ఎకరాలున్న వాళ్ళు కూడా లక్షలకు లక్షలు సంపాదించింది లేదు. పట్టణాల్లో కాలుమోపి, వ్యాపార రంగంలో తల దూర్చిన కుటుంబాలు మాత్రమే మా ఊళ్ళో సంపన్న కుటుంబాలు. భూమినే పూర్తిగా నమ్ముకున్న వాళ్ళు మాత్రం తాతల తరంలో ఎలా ఉన్నారో ఇప్పుడూ అలానే ఉన్నారు. ఎప్పుడూ కాయకష్టం మీద ఆధారపడి పనిపాటల్లో మునిగితేలేవాళ్ళు కావడం వల్ల, కక్షలూ, కార్పణ్యాలూ లేక గ్రామ జీవితం చాలా వరకూ ప్రశాంతంగా ఉండేది మొన్న మొన్నటి వరకూ. అయితే ఇటీవల కొన్ని అపశ్రుతులు నేనున్న ఊరి దాకా కాస్త వినవస్తూనే ఉన్నాయి. ఇంతకు మునుపు ఏ ఎన్నికలొచ్చినా ఎవరూ వీరావేశంతో ఊగిపోయేవాళ్ళు కాదు. ఎవరి వోటు వాళ్ళు ప్రజాస్వామ్య బద్ధంగా వేసుకొనేవాళ్ళు. తొంభై శాతం వోట్లు పోలయినా, దొంగ వోట్లు లేని ఊరు మా ఊరు అని గొప్పగా చెప్పుకొనే వాణ్ణి నేను. అయితే


చిత్రాలు: నర్సిం



మండలాల ఎన్నికల తరువాత మునుపటిలా ఊరు లేదని. చిల్లర మల్లర గొడవలు అప్పుడప్పుడూ జరుగుతున్నాయని నాకు తెలుస్తూనే ఉంది. సరే ఆ మాత్రం వ్యవహారాలు నడవని పల్లెలు ఇప్పుడు దేశంలో ఎక్కడున్నాయని?

అనంతపురంలో రైలు దిగి, తెల్లవారు జాము కావడంతో అక్కడే వెయిటింగ్ రూమ్‌లో కొంత సేపు విశ్రమించి, ఉదయం ఏడుగంటలకు బస్టాండ్‌కు చేరుకున్నాను. ఇంతకు మునుపైతే మా ఊళ్ళోకి బస్సులు వెళ్ళేవి కావు. మెయిన్‌రోడ్‌లో దిగి నాలుగు కిలోమీటర్లు నడవాల్సి వచ్చేది. ఎక్స్‌ప్రెస్ కాకుండా, సాధారణ బస్సులన్నీ ఇప్పుడు ఊళ్ళోకి వెళ్ళి తిరిగి వస్తాయి.

ఏడున్నరకు బయల్దేరింది బస్సు. తొమ్మిదికల్లా చేరుకుంటుంది మా ఊరు. కొంత కునుకు తీశానేమో. ఊరు రాగానే నా వెనుకనున్న మనిషి "నారాయణ మామా! ఊరొచ్చింది" అని లేపడంతో, లేచి నిలబడి నన్ను నిద్రలేపిన మనిషికేసి చూశాను. మా ఊరివాడే. తెలిసిన మొహం పేరు గుర్తు రాలేదు. చిరునవ్వుతో పరామర్శించాను. బ్యాగ్ చేతిలో పట్టుకొని కిందికి దిగాను. బస్సు దిగీదిగగానే ఊరి వాతావరణంలో ఏదో మార్పు కొట్టొచ్చినట్టు కనిపించింది నాకు.



> "ఏం జరిగిందమ్మా ఊళ్ళో, మనుషులే కనిపించడం లేదు. పైగా పోలీసులు..."

ఎప్పుడూ రద్దీగా ఉండే నాగుల కట్ట మీద ఒక్క మనిషి కూడా కనిపించలేదు. దారి పక్కనే ఉండే బంకులు మూతపడి ఉన్నాయి. ఆ పక్కనే ఉన్న కొట్టం హోటల్ కూడా నిశ్శబ్దంతో నిట్టూరుస్తున్నట్టుగా ఉంది. ఎప్పుడూ వచ్చి పోయే మనుషులతో సమ్మర్దంగా కనిపించే ఆవీధి మొత్తం నిర్మానుష్యంగా, బోసిపోయినట్టుగా ఉంది. అక్కడక్కడా గాడిదలూ, కుక్కలూ మాత్రం ప్రేక్షక స్థానంలో పర్యవేక్షిస్తున్నట్లుండిపోయాయి.

కొద్ది క్షణాలు నిలబడి అటూ ఇటూ చూస్తే, దూరంగా వేపచెట్టు కింద అయిదారుగురు పోలీసులు తుపాకులతో నిలబడి ఉండడం కనిపించేసరికి "ఏదో జరిగింది" అన్న నిశ్చయానికి వెంటనే వచ్చేశాను నేను. ప్రయాణికుల్ని దింపిన బస్సు వెనక్కు తిరిగి వెళ్తూ ఉంది. ఔను ప్రయాణికులెవరూ దిగినట్టే లేదే! నన్ను మామా అని పిలిచిన కుర్రాడు ఒక్కడే దిగినట్టు ఉంది. ఇంత పెద్ద ఊళ్ళో, బస్సు దిగే వాళ్ళూ లేరా! ఎంత విడ్డూరం. ఒకటే ఆశ్చర్యం నాకు. ఏం జరిగిందో చెప్పడానికి కూడా అక్కడెవ్వరూ కనిపించకపోవడంతో చకితుణ్ణయ్యాను. సరే ఇంటికెళ్తే అన్ని వివరాలూ తెలుస్తాయి అనుకుంటూ మా ఇంటివేపు గబగబా నడవసాగాను.

వీధివేపు తలుపులున్న ఇళ్ళముందూ, తలుపుల దగ్గరా ఆడవాళ్ళు మాత్రమే కనిపించారు. పెద్ద సందు మలుపు తిరగ్గానే వీధి మొదట్లోనే మా ఇల్లు. మా ఇంటి ముందు పాతకాలపు వేప చెట్టు ఒకటి ఉంది. వేపచెట్టు కింద ఉన్న పెద్ద రాతి బండ మీద కూడా ఎవరూ లేరు. ఆశ్చర్యమే కాదు ఏదో అవ్యక్తమైన దిగులు కూడా నా మనసును ఆవరిస్తోంది. నేరుగా గడప దాటి ఇంట్లోకి వెళ్ళాను. వెళ్ళగానే లోపల జగతి మీద కూచున్న నా పెద్ద మరదలు లేచి, గబగబా ఎదురుగా వచ్చి "రా! బావా" అంటూ పిలిచింది. "ఈ పొద్దో, రేపో, వస్తావనే అనుకుంటూ ఉండా" అంది. ఆ పలకరింపులు విని వంటింట్లో ఉన్న రెండో మరదలు కూడా వచ్చింది. వాతావరణంలో ఏదో అసహజత్వమూ, అప్రసన్నతా కనిపించింది నాకు.

మొహం కడుక్కొని తువ్వాలుతో తుడుచుకుంటూ, జగతి మీద అప్పుడే పరిచిన చాప మీద కూచున్నాను. నా రాక పసికట్టిన పిల్లలు బిలబిలా నా పక్కకు వచ్చి ప్రేమగా నిలబడ్డారు. వాళ్ళ కోసమే తెచ్చిన పళ్ళూ, బిస్కెట్ పాకెట్లూ, పూలూ బ్యాగ్ నుంచి తీసి అందరికీ అందించాను. పిల్లలను ఏదో గదురుకుంటూ ఉన్నారు తల్లులిద్దరూ.

పిల్లలు బయటికి వెళ్ళగానే, "ఏం జరిగిందమ్మా ఊళ్ళో, మనుషులే కనిపించడం లేదు. పైగా పోలీసులు" అనడిగాను. ఏదో వెంటనే తెలుసుకుంటే తప్ప నా మనసు కుదుటపడేట్టుగా లేదు.

"నిన్న రాత్రి ఊళ్ళో బాంబులు పేలినాయి బావా! ఒకటీ రెండు కాదు, నలభైకి పైగానే పేలినాయి. ఊరంతా వణికిపోయిందనుకో. రెండు మూడు గంటలసేపు విసురుకుండారు బాంబులు" అంది మా పెద్ద మరదలు.

"బాంబులా! మనూర్లోనా" అన్నాను విస్తుపోతూ.

"ఇది రెండోసారి బావా! మూడు నెల్ల కిందట పదికి పైనే బాంబులు పేలినాయి. అప్పుడూ ఇట్లే అయింది" అంది చిన్న మరదలు.

"ఏమైనా ప్రాణ నష్టం జరిగిందా" అనడిగాను.

"అప్పుడైతే మన బోడెప్ప కొడుకు శివాలుగానికి కుడి చెయ్యి పచ్చడైపోయింది. రాత్రి నలుగురైదు గురికి పెద్దపెద్ద గాయాలైనాయంట. ఆసుపత్రికి తీసుకుపోయినారు. అదృష్టంకొద్దీ ఎవరూ చచ్చిపోలేదు. తెల్లారేసరికి ఊరినిండా పోలీసులు" అంది పెద్ద మరదలు.

అప్పుడు గుర్తుకొచ్చింది. "ఇంతకూ మన వాళ్ళేరమ్మా" అనడిగాను.

"అందరూ రాత్రికి రాత్రే పరారైపొయ్యినారు బావా! ఎవ్వరుంటే ఏం నెత్తిమీదికొస్తుందో అని భయం. పోలీసులకు చిక్కితే ఇంకేమన్నా ఉందా? పొద్దున్నే ఇద్దరు పోలీసోళ్ళు వచ్చి ఇల్లంతా సోదా చేసి పొయ్యినారు. ముసిలీ ముతకా తప్ప ఊర్లో మగవాళ్ళంతా పరారులో ఉన్నారిప్పుడు." ఇద్దరూ కూడబలుక్కున్నట్లు చెప్పుకొచ్చారు.

"సరే ఇంతకూ బాంబులు వేసింది ఎవరు? ఎవరిమీద వేసినారు? మధ్యలో మన వాళ్ళకేం సంబంధం" అనడిగాను ఆరాటపడిపోతూ.

పెద్ద మరదలు సంగతంతా చెప్పుకొచ్చింది. ఈలోగా చిన్న మరదలు పెద్దగ్లాసు నిండుగా కాఫీ తెచ్చి ఇచ్చింది. ఎవరికో ఇంతకు మునుపే చెప్పిన కథను రెండవసారి చెప్పినట్టుగా చాలా నెమ్మదిగా, వివరంగా చెప్పింది.

ఎంత వివరంగా చెప్పినా, ఆమె చెప్పిన దాంట్లో నాకు బోధపడిన అంశం ఒకటే! రామక్రిష్ణప్ప కుటుంబానికీ, వెంకటరెడ్డి కుంటుంబానికీ ఈ రెండు మూడేళ్ళలో విరోధం బాగా ముదిరిపోయిందట. గడ్డివాములు కాల్చుకోవడం, మోటారు పంపులు పేల్చివేయడం, చీనాచెట్లు నరికివేయడం, పశువుల కొట్టాల్లు కాల్చివేయడం లాంటివి ఇరువర్గాలకూ జరిగినాయట! కేసులు ఈ రెండేళ్ళుగా నడుస్తున్నాయట. గుత్తి జైల్లోనూ, కడప జైల్లోనూ ఇరువర్గాల వాళ్ళూ, నెలరోజులకు పైగా రిమాండ్ కాలంలో ఉండి వచ్చారట. ఊరు మొత్తమంతా రెండు వర్గాలుగా చీలిపోయిందట. ఏ రోజు ఏం జరుగుతుందో అని అందరికీ ఎప్పుడూ భయమేనట. మన వాళ్ళకు ఏ సంబంధమూ లేకపోయినా, రామక్రిష్ణప్పకు బంధువులౌతారు కాబట్టి, ఏ కేసులోనైనా ఇరికించవచ్చునని అనుమానమట. ఇంతకు ముందు కూడా వారం రోజులు పరారులో ఉన్నారంట. కేసులో తమ పేర్లు లేవని తెలిసినంక తిరిగి వచ్చినారంట. ఈ మధ్య చిన్న తమ్ముడు కొంత దూకుడుగా ఉన్నాడంట. నెల కిందట చెరువు నీళ్ళ వంతుల విషయంలో వాళ్ళతో గొడవ పడినాడంట. అందుకే ఇప్పుడు కేసులో ఎక్కడ ఇరికిస్తాడో అని భయంగా ఉందంట... ఇలా చాలా విషయాలు చెప్పుకొచ్చినా ఎందుకీ గొడవలూ, కక్షలూ ఏర్పడినాయో స్పష్టం చేయలేకపోయినారు.

నా మనసంతా, ముళ్ళకంచె మీద చిక్కుబడిన తమలపాకు తీగలాగా గాయపడింది. ఎలాంటి ఊరు ఎలా తగలపడిపోతున్నది అన్న వేదనతో ఆలోచనలు ఘనీభవించిపోయాయి.

రామక్రిష్ణప్ప, వెంకటరెడ్డిల కుటుంబాలు ఒకప్పుడు ఎలా ఉండేవి? పక్కపక్క వీధుల్లోనే వాళ్ళ ఇళ్ళు. వాళ్ళ తోటలు కూడా పక్కపక్కనే. ఊళ్ళో హైస్కూల్ తెప్పించడానికీ, రక్షిత నీటి పథకం ఏర్పాటు చేయించడానికీ, పశువుల ఆస్పత్రి నెలకొల్పడానికీ, మైన్‌రోడ్డు నుండీ ఊళ్ళోకి బస్సులు వచ్చేలా చూడ్డానికీ, ఇలా ఎన్నెన్నో పనులు కలిసికట్టుగా చేసిన వాళ్ళు ఆ ఇద్దరూ! రెండు టర్మ్‌లు సింగిల్ విండో ప్రెసిడెంట్‌గా వెంకటరెడ్డిని ఉండేలా

చూసింది రామక్రిష్ణప్పే అని చుట్టు పక్కల ఊళ్ళ వాళ్ళకు కూడా తెలుసు. రామక్రిష్ణప్ప అన్న చాలా ఏళ్ళు పంచాయతీ ప్రెసిడెంట్‌గా ఉండేవాడప్పుడు. ఆ పదవిని బలవంతంగా అంటగట్టారతనికి. నాకు వద్దు కుయ్యోమొర్రో అన్నా వినకుండా, ఊరికి పెద్ద దిక్కువు నువ్వు అని అంటగట్టారాపదవి అతనికి. అయితే, అతడు నామమాత్రమే. వ్యవహారమంతా రామక్రిష్ణప్పే నడిపేవాడు. అదొక పెద్ద కిరీటం లాంటి పదవి అని ఎవరూ అప్పట్లో అనుకున్నట్టు లేదు.

వెంకటరెడ్డిది అప్పట్లో ఆర్థికంగా కాస్త దెబ్బ తిన్న కుటుంబం. సేద్యమూ, పిల్లల చదువులూ, ఆడపిల్లల పెళ్ళిళ్ళూ, వీటితో కొంత చితికిపోయినా, తన ఆర్థిక స్థితిని ఎప్పుడూ బయట పెట్టుకొనేవాడు. అతని పరిస్థితి ఎప్పటికప్పుడు గ్రహిస్తున్నవాడు కాబట్టి రామక్రిష్ణప్ప, ఎన్నోసార్లు అనేక విధాలా సహాయపడ్డాడు.

వెంకటరెడ్డి కొడుకు బి.ఏ ఫెయిలై, ఊళ్ళోనే ఉంటున్నాడిప్పుడు. రామక్రిష్ణప్ప పిల్లలెవ్వరూ హైస్కూల్ చదువు దాటలేక పోయినారు. రామక్రిష్ణప్ప పెద్దకొడుకు, వెంకటరెడ్డి కొడుకు, ఇద్దర్నీ చిన్నప్పట్నుంచీ చూస్తున్నాను నేను. వాళ్ళిద్దరూ ఒకే మోటర్‌బైక్‌లో టౌన్‌కు వెళ్ళి రావడం కూడా చూశాను నేను. అలాంటి కుటుంబాల మధ్య ఇంత ఘోరమైన బాంబుల వైరం ఎలా వచ్చిందో ఏమిటో అని దిగులుపడి పోయాను నేను.

రెండోసారి కప్పు కాఫీ తాగి ఇంట్లో నుండి బయటకు వచ్చాను. నేనేం చెయ్యాలో కూడా బోధపడని పరిస్థితి. బయటకు అడుగేస్తుంటే "వెనకటి మాదిరి నువ్వు, ఆ వెంకటరెడ్డి వాళ్ళ ఇండ్ల కాటికి పోవద్దు బావా! పరిస్థితి శానా మారి పోయిందిప్పుడు" అంటూ హెచ్చరించింది మరదలు.

ఇంతకు మునుపు నేను ఎప్పుడు ఊరికి వచ్చినా అన్ని ఇళ్ళూ ఒక రౌండ్ వేసుకొని వచ్చేవాణ్ణి, అందర్నీ వరసలు పెట్టి పలకరించేవాణ్ణి. ఇంటింటి దగ్గరా కప్పు కాఫీ తాగే వాణ్ణి. నా కాఫీ ప్రియత్వం తెలిసి అందరూ మంచి కాఫీ అందించే వాళ్ళు. ఆ అభిమానాలు నిజంగా నాశనమైవుంటాయా!

గడపదాటి ఇంటి ముందున్న వేపచెట్టు నీడలో బండమీద నిస్సత్తువుగా కూలబడిపోయాను. నేను రావడం గమనించినాడేమో ఎదురింటి నాగప్ప తాత కట్టె ఊదబొడుచుకుంటూ నెమ్మదిగా వచ్చాడు నా దగ్గరకు. డెబ్భయ్ ఏళ్ళకు పైగా ఉంటాయి నాగప్ప తాతకు. అందర్నీ కుశాలగా పరిహాస ధోరణిలో పలకరించే మంచి మనిషి. ఎవర్ని ఎలా అన్నా, నాలుగు తిట్లు తిట్టినా, ఎవరూ పట్టించుకొనేవారు కాదు.

"ఏం వాయ్ నారాయణా! పద్దన్నే వచ్చినట్లుండావ్! పిల్లా జెల్లా అంతా బాగుండారా" అంటూ పరామర్శ ప్రారంభించాడు.

నేను లేచి అతన్ని మెల్లగా, బండమీద పొందికగా కూచోబెట్టినాను.

"టౌన్లలో కాపురాలుండే మీయట్లా వాళ్ళదేరా ఇప్పుడు కాలమంతా. మనూరి కత చూడి. ఎట్లాంటి ఊరు ఎట్లయిందో." అంటూ నిట్టూర్పు విడిచాడు నాగప్ప తాత!

"ఈ మూడు నాలుగేళ్ళలో మనూరు ఇంత ఘోరంగా ఎట్లా మారిపోయింది తాతా" అనడిగాను.

"మనూరే కాదురా నారాయణా! అన్ని ఊర్లూ ఇప్పుడు ఇట్లే ఉండాయి. బాంబుల శబ్దం ఎప్పుడన్నా వినింటిమా మనం? బాంబులు అంటే కడప జిల్లానే అనుకుంటా ఉంటిమి ఇన్నాల్లూ. ఇప్పుడు మన దిక్కు కూడా బాంబులు లేని ఊరు లేదనుకో" అన్నాడు.

నాగప్ప తాతకు సిగరెట్టు ఇచ్చాను నేను. మామూలుగా బీడీలు తాగుతాడు. ఎవరైనా నా బోటివాడు సిగరెట్టు ఇస్తే తిరస్కరించడు. దంటు

> "టౌన్లలో ఉండే మీయట్లా వాళ్ళదేరా కాలమంతా. మనూరి కత చూడి. ఎట్లాంటి ఊరు ఎట్లయిందో."

తాగినట్లే ఇది. రుచా? పచా" అంటూనే తీసుకుంటాడు. సిగరెట్ నోట్లో పెట్టుకుంటే నేనే వెలిగించాను.

"మనూరు ఇప్పుడు ఊరే కాదనుకో. ప్రతి పిల్ల నాయలూ ఇప్పుడు పెద్దమనిషే. ఎవురూ ఎవుర్నీ దండిచ్చేకి లేదిప్పుడు. నెలకిందట నగుసారంగా గోపాలప్ప కొడుకును ఏదో ఒక మాట అంటిరా. ఇంక చూడు. తిట్టిన తిట్టు తిట్టకుండా నన్ను వాంచి పారేసినాడు ఆ పిల్లోడు. ఇంగోసారి ఇట్ల మాట్లాడినావా కీళ్ళిరగదంతా అన్నాడు వాడు. ఇంతా చేస్తే వాడి వయసు ఇరవైలోపే" అంటూ కళ్ళనిండా నీళ్ళు పెట్టుకున్నాడు నాగప్ప తాత. ఎంతో పెద్దమనిషిగా పేరు తెచ్చుకున్నవాడు నాగప్పతాత. కుళ్ళూ, కువ్వాడమూ లేకుండా అందరితో ఆనందంగా మాట్లాడేవాడు. ఇట్లాంటి పెద్ద దిక్కు కూడా ఇప్పుడు మౌనంగా ఉండిపోవాల్సి వచ్చింది.

సిగరెట్ సరిగా తాగడం చేతకాకపోవడంతో, ఎంగిలితో అంతా తడిసిపోయింది. "థూథూ" అంటూ దాన్ని పారవేసి నా బీడీ తాగితేనే బాగుండేది" అంటూ తన బీడీ తీసి వెలిగించుకున్నాడు. బీడీ రెండు పీకులు పీకి "మనూరి కత గదా అడిగితివి! ఆ రాజేంద్రప్ప మనుషులు మనూర్లోకి అడుగు పెట్టిరి. ఊరే మారిపాయ. వాళ్ళనని ఏం లాభం. మనకు బుద్దుండల్ల" అన్నాడు నాగప్ప తాత.

రాజేంద్రప్ప పేరు వినగానే ఒక పల్చటి రాజకీయ చిత్రం నా కళ్ళ ముందు మెదిలింది. రాజేంద్రప్ప నాకు తెలుసు వాళ్ళ నాన్న నాకు తెలుసు. జిల్లా మొత్తానికి వాళ్ళ కుటుంబం గురించి తెలుసు. వాళ్ళ కుటుంబ రాజకీయ జీవితమూ, కక్షలూ తెలుసు. వాళ్ళెంత నష్టపోయిందీ తెలుసు. మా ఊరికి ఇరవై మైళ్ళ దూరంలో ఉంది రాజేంద్రప్ప ఊరు. ఆరేళ్ళ క్రితం, ఒక ఉప్పెనలా, ఒక కెరటంలా రాజకీయాల్లోకి దూసుకు వచ్చిన వాడు రాజేంద్రప్ప. రాజకీయాల్లోకి వచ్చీ రాగానే ఒక నియోజక వర్గం మొత్తాన్ని తన గుప్పిట్లో ఉంచుకున్న వాడు. తనదంటూ ఒక సైన్యాన్ని తయారు చేసుకున్నవాడు. ఆయుధాలు సమకూర్చుకున్నవాడు. గడచిన మండలాల, పంచాయతీల ఎన్నికల్లో ఒక నియోజకవర్గాన్నంతా శాసించినవాడు. నియోజకవర్గం మొత్తం అంతా ఎన్నికలే లేకుండా చేసినవాడు. తన వర్గాన్ని ఏకగ్రీవంగా అధికారంలోకి తెచ్చుకున్నవాడు. పక్క నియోజకవర్గంలో కూడా చాలా మండలాల్లో తన సైన్యాన్ని పంపి, రిగ్గింగ్ చేయించి తన వర్గాన్ని గెలిపించుకున్నవాడు. అతడు కదిలితే ముందూ వెనుకా, జీపులూ, కార్లూ, సైన్యమూ, ఆయుధాలూ! ఒక భయోత్పాత వాతావరణాన్ని తన శత్రువుల గుండెల్లో నింపినవాడు. ప్రతి ఊళ్ళోనూ ఇప్పుడు రాజేంద్రప్ప వర్గం ఉంది. రాజేంద్రప్ప మనుషులున్నారు. రాజేంద్రప్ప మనుషులంటే చాలు జనం భయపడేట్లు చేసుకున్నవాడు. రాజకీయాల్లోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే రాష్ట్ర రాజకీయాల్లోనే వివాదాస్పదంగా తయారైనవాడు. ఒక భయం ఉచ్చును అల్లి తన ఉనికిని నిర్మించుకున్నవాడు.

రాజేంద్రప్ప పేరు వినగానే ఇదంతా మెదిలింది నా మనసులో. నేను ఎక్కడో దూరాభారంలో ఉండి కూడా అతని ప్రభ అనేక సందర్భాలలో, మనుషుల ద్వారా, పత్రికల ద్వారా తెలుసుకుంటూనే ఉన్నాను నేను. రాజేంద్రప్ప నాకు ఒక ఆశ్చర్యార్థకం గుర్తు! వర్తమాన రాజకీయాలకు ఒక సంకేతం!

నాగప్ప తాత చెబుతూనే ఉన్నాడు. ఊరు ఎట్లా మారిపోయిందీ–

"అయిదేండ్ల కిందట పంచాయతీ ఎన్నికలొచ్చినప్పుడు వెంకటరెడ్డి కొడుకు భీమిరెడ్డి నేను ఈసారి పంచాయతీ సర్పంచ్‌గా ఉంటాను అన్నాడు. రామక్రిష్ణప్పా, ఆయప్ప కొడుకు నాగేంద్రా కూడా అట్లేకానీ అనుకుండారు మొదట్లో. ఆ తరువాత ఏం జరిగిందో ఏమో ఎవురికీ తెలీదు. ఎలక్షన్లకు నామినేషన్లు వేసేటయ్యానికి, నాగేంద్ర కూడా నేనూ వేస్తాను అన్నాడంట.

ఆడ మొదలయ్యింది అసలు గొడవంతా! నామినేషన్‌కు రెండు రోజుల ముందు, రాజేంద్రప్ప మనుషులు రెండు జీపుల్లో వచ్చినారు. భీమిరెడ్డిని కలిసినారు. నువ్వు నామినేషన్ ఏసేకి లేదని చెప్పినారంట. బెదరించి పొయ్యినారంట. రాజేంద్రప్పను ఎదిరించి నామినేషన్ ఏసేవాడు ఈ ఏరియా మొత్తంలో ఎవురుండారు? ఇంకేముంది? రామక్రిష్ణప్ప కొడుకు నాగేంద్ర పోటీ లేకుండా గెలిచినాడు. అప్పట్నుంచీ మొదలయ్యింది. ఊర్లో ప్రతి చోటా కొట్లాటలూ, అరునుకోవడాలూ– ఊరు ఊరంతా రెండు గ్రూపులయిపోయింది. రెండు గ్రూపుల్లోనూ కడ్డీలాంటి మనుషులు తయారైనారు. బాంబులు దిగినాయి. కత్తులు దిగినాయి. తుపాకులు కూడా దిగినాయి. భీమిరెడ్డి గ్రూపుకు అండగా రాజకీయాలు చేసేవాళ్ళు, వత్తాసు ఇచ్చే నాయకులూ హైదరాబాదు దంకా తయారైనారు. సై అంటే సై అని అందరూ మీసాలు దువ్వే వాళ్ళయి నారిప్పుడు. ఊర్లోకి బ్రాందీ సీసాలు వచ్చినాయి. పోస్తే తాగే వాళ్ళు తయారైనారు. ఉబ్బిచ్చి పని చేసుకొనే నాయాళ్ళు తయారైనారు.



అసలే పనీ పాటా లేని కాలం. ఇప్పుడిదే పని జనానికి..." అంటూ వివరంగా చెబుతూ ఉన్నాడు నాగప్ప తాత.

నాకు విషయాలు అర్థమవుతూ ఉన్నాయి. రాజేంద్రప్ప రాజకీయాల్లోకి రాకముందు ఒక గ్రూపు మొత్తం అధికారం చలాయిస్తూంటే, దాని నడుం విరిచేందుకు పూనుకున్నాడు రాజేంద్రప్ప. ఒకవర్గం పల్లెలకు పల్లెల్ని అగ్నిగుండంలా మారుస్తున్న నేపథ్యంలో దాన్ని ఎదుర్కోవడానికీ, తన వర్గాన్ని రక్షించుకోవడానికీ, రాజకీయాల్లోకి వచ్చినవాడు రాజేంద్రప్ప. దాని పర్యవసానమే ఇదంతా! మంచీ చెడుల ప్రసక్తి లేదిప్పుడు. అధికారం, పెత్తనం తమ గుప్పిట్లో ఉంచుకోవడం ఒక్కటే ఇప్పుడు రాజకీయాలు అంటే! రాజేంద్రప్ప వర్గం కావచ్చు. అతని శత్రువర్గం కావచ్చు. ఏ వర్గానికీ సిద్ధాంత రాజకీయాలు లేవు. ఆధిపత్య రాజకీయాలు తప్ప. హత్యారాజకీయాలు తప్ప. వ్యక్తిగత కక్షలు తప్ప. తమ ప్రయోజనాల కోసం పల్లెల్ని చీలుస్తున్నారు. మొత్తం మీద ఈ రెండు వర్గాల మధ్య పల్లెలు ఉడికి పోతున్నాయి. నాగప్ప తాత చెబుతూనే ఉన్నాడు. చుట్టూ ఉన్న పల్లెల్ని గురించి కూడా చెబుతున్నాడు. పల్లెలెట్లా మారిపోయిందీ చెబుతున్నాడు. కొన్ని పల్లెలు ఊరు మొత్తం ఎలా వల్లకాడయిందీ చెబుతున్నాడు. ఏఏ ఊర్లలో ఎన్ని ఖూనీలు జరిగిందీ చెబుతున్నాడు. అంతా వింటున్న నా మనసంతా వికారమై పోయింది.

"అన్నమయింది తిందురా బావా" అన్న పిలుపుతో ఆలోచనల్లోంచి బయటపడ్డాను.

"మధ్యాన్నమయింది. అన్నం తినిరా నాయనా" అంటూ తానూ లేచాడు నాగప్ప తాత.

"నువ్వూ తిందురా తాతా" అని పిలిచింది నా మరదలు.


"వద్దన్నే ఇంత ముద్ద తిన్నా తల్లీ" అంటూ తన ఇంటివేపు నడిచాడు.

భోజనం చేస్తున్నంతసేపూ, దిగులుగా ఏదో చెబుతూనే ఉన్నారు మరదళ్ళు.

"ఎక్కడున్నారో ఏమో! ఏం తింటున్నారో ఏమో! ఏ సంబంధమూ లేకపోయినా ఈ కర్మ మనకెందుకు వచ్చి పడిందో" అంటూ సన్నగా ఏడుపు తీసింది చిన్న మరదలు.

"ఈ వారంలో శనక్కాయ పీకించల్ల. ఆ పంటా ఆటికాటికే ఉంది. పీకించకపోతే అయిన కాసిన్ని బుడ్డలూ నేలపాలైపోతాయి. ఊర్లో చూస్తే మనుషులే లేరు" అంటూ బాధపడిపోతోంది పెద్ద మరదలు.

అసలే అంతతంత మాత్రంగా ఉన్న వ్యవసాయం. దానికి తోడు ఈ కక్షలు-



వర్షం మీద ఆధారపడి, మెట్ట భూముల్లో వేరుశనగ వేస్తే, ఏ మూడు సంవత్సరాలకో ఒకసారి పంట కంట పడుతుంది. పెట్టుబడులు కూడా గిట్టని సంవత్సరాలెన్నెన్నో. బావుల్లో నీళ్ళింకిపోయి పదేళ్ళు దాటింది.

అంతా బోర్ల సేద్యమే. విపరీతమైన పెట్టుబడులు. నీళ్ళు చాలవు. కరెంటు ఉండదు. ఇంక ఏగతీ, దిక్కులేక చేసే సేద్యమేగాని నిజానికిదంతా ఇక్కడి రైతాంగానికి ఒక పెద్ద శిక్ష! తినేకి కూడులేక అలమటిస్తున్న జనానికి, చిచ్చులా పల్లెల్లోకి ప్రవేశించిన ఈ కక్షలొకటి! ఏ సంబంధమూ లేకపోయినప్పటికీ ఈ ఉచ్చులో బిగుసుకుపోయే వాళ్ళెందరెందరో!

"ఏం బావా! అప్పుడే చెయ్యి కడుక్కుండావు. బొత్తిగా రెండు పిడసలు కూడా తినలేదు. ఎంత బాధపడితే మాత్రం జరిగేదాన్ని ఆపగలుగుతామా" అంటూ విచారపడినారు.

నిజంగా ఆకలి చచ్చిపోయింది నాకు. ఊరి కథ పక్కన పెట్టినా, ఈ సంసారం గతి ఏమిటి? ఈ కక్షల్లో పడి ఏమవుతుందో ఏమో ఈ సంసారం? ఎప్పుడు తిరిగి వస్తారు వీళ్ళు?

ఊరి చుట్టూ ఉన్న వేలాది ఎకరాల వేరుశనగ పంట నేలపాలు కావాల్సిందేనా? ఎలా బాగు పడుతారీ మనుషులు? ఎవరు సంస్కరిస్తారీ పల్లెల్ని?

ఆలోచిస్తూ, ఆలోచిస్తూ, అలాగే మంచం మీద శరీరం వాల్చి మెల్లగా నిద్రలోకి జారుకున్నాను. చాలాసేపుగా నరాలు టెన్షన్ అనుభవించడంతో అలసిపోయింది శరీరం!

పెద్ద కలకలం, గట్టిగా అరుపులూ, కేకలూ, వినపడడంతో ఉలిక్కిపడిలేచాను. ఎంతసేపు నిద్రలో మునిగిపోయానో ఏమో!

సాయంత్రమయినట్లుంది. ఇల్లంతా మసకగా ఉంది. ఇంట్లో ఎవరూ ఉన్నట్లు లేరు. అరుపులూ, కేకలూ, ఏడుపులూ వినిపిస్తూనే ఉన్నాయి. మనసేదో కీడును శంకిస్తోంది.

గబగబా పరుగులాంటి నడకతో బయటికొచ్చాను. నాగప్ప తాత బండమీద నిర్వికారంగా కూర్చుని ఉన్నాడు.

"ఏమైంది తాతా" అన్నాను ఆత్రంగా.

"ఒరే నారాయణా! ఇంట్లోనే ఉండావా నాయనా! మన చింతతోపులో ఖూనీ జరిగిందంట. రెండు ఖూనీలంటా ఉండారు. మూడంటా ఉండారు. జనమంతా ఆటికి పరుగులు తీస్తా ఉండారు. వద్దన్నా వినకుండా మన ఆడోళ్ళు కూడా అరుసుకుంటా పొయ్యినారు. ఇంతకూ ఎవరో ఏమో" అంటూ నిస్సత్తువగా చెప్పినాడు నాగప్ప తాత.

చెప్పులు వేసుకొని నేను కూడా బయల్దేరాను. వెనక నాగప్ప తాత ఏదో చెబుతూనే ఉన్నాడు. చింత తోపు అంటే ఊరికి మైలు దూరంలో ఉంది. చాలా పెద్ద తోపు ఒకప్పుడు. ఆ తోపు ఎవరిదీ కాదు. ఊరి మొత్తానిది.

బజార్లోకి వచ్చేసరికి గుంపులు గుంపులుగా, జనం నడుస్తూ, పరుగులు తీస్తూ, అరుస్తూ, ఏడుస్తూ, ...

ఆ చచ్చింది ఎవరో- తమవాడేనో ఏమో! అందరికీ భయం! బయటికి చెప్పుకోవాలంటే భయం.

భయం - భయం

భయంతో పరుగులూ, అరుపులూ

ఏడుపులూ, పెడబొబ్బలూ

సూర్యబింబం, ఎర్రగా, రక్తపు ముద్దలా, పడమటి అంచున మెరుస్తూ ఉంది.

నా అడుగులు ముందుకు సాగుతూనే ఉన్నాయి. భయంతో, అనుమానంతో, నిస్సత్తువగా!

అన్నదమ్ముల భాగాలు పంచి పెట్టాలని వచ్చిన వాడికి, ఊరు భాగాలై పోయి, ముక్కలు చెక్కలైపోయి, విడిపోయి ఉంటే, చూడాల్సి వచ్చినందుకు, దుఃఖంతో, సిగ్గుతో, దిగులుతో, అవమానంతో, నడుస్తూనే ఉన్నాను, నడుస్తూనే ఉన్నాను, ఎదురుగా మెరుస్తూన్న రక్తపు ముద్ద స్వాగతిస్తూంటే ■